నమస్తే తెలంగాణ
నిజామాబాద్
5 | నిజామాబాద్, సోమవారం 24 ఫిబ్రవరి 2025 | NIZAMABAD

**ఉమ్మడి జిల్లాలో** ఎమ్మెల్సీ ఎన్నికల హడావుడి నెలకొన్న నేపథ్యంలో నేడు ముఖ్యమంత్రి జిల్లా పర్యటన ప్రాధాన్యం సంతరించుకున్నది. 15 నెలల కాలంలో లోక్‌సభ ఎన్నికల సమయంలో నిజామాబాద్‌కు సీఎం హోదాలో తొలిసారిగా వచ్చారు. పాత కలెక్టరేట్ మైదానంలో ఏర్పాటుచేసిన కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి టీ జీవన్‌రెడ్డి ప్రచార సభలో పాల్గొని, దేవుళ్లపై ఒట్టేసి రైతు రుణమాఫీ పూర్తి స్థాయిలో చేస్తానంటూ హామీ ఇచ్చారు. కానీ ఆయన ఇచ్చిన హామీ ఇంతవరకూ నెరవేర్చలేదు. సుదీర్ఘకాలం తర్వాత రెండోసారి నిజామాబాద్‌కు సీఎం వస్తున్నారు. ఇది కూడా ఫక్తు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగమే కావడం గమనార్హం. ఇసుక అక్రమ రవాణాపై కఠినంగా వ్యవహరించాలని ఇటీవల సీఎం ఆదేశాలు జారీ చేశారు. కానీ జిల్లాలో ఆయన ఆదేశాలను అక్రమార్కులు, అధికార పార్టీ నేతలు బేఖాతరు చేస్తున్నారు. ఇసుక దందాను అడ్డుకోవడంలో అధికారులూ ఉదాసీనంగా వ్యవహరిస్తుండడంతో ఉమ్మడి జిల్లాలో యథేచ్ఛగా ఇసుక దోపిడీ కొనసాగుతున్నది.

–నిజామాబాద్, ఫిబ్రవరి 23 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

# ఎన్నికలుంటేనే.. సారొచ్చేది

**నేడు నిజామాబాద్‌కు సీఎం రేవంత్‌రెడ్డి రాక**

- సీఎం హోదాలో 15 నెలల్లో రెండుసార్లు ఎన్నికల ప్రచారానికే..
- ఎంపీ ఎలక్షన్‌లో రైతు రుణమాఫీపై ఇందూరు వేదికగా దేవుళ్లపై ఒట్టేసిన ముఖ్యమంత్రి
- హామీల అమలులో విఫలం
- జిల్లాలో సగం మంది రైతులకు అందని రైతుభరోసా
- ఇసుక దోపిడీని అడ్డుకోవాలని రేవంత్ ఆదేశాలు
- పట్టించుకోని అధికార పార్టీ నాయకులు
- బాల్కొండ, బోధన్, జుక్కల్ నియోజకవర్గాల్లో యథేచ్ఛగా ఇసుక దందా

ఇసుక అక్రమ రవాణాను పూర్తిస్థాయిలో అరికట్టాలంటూ వారం రోజుల క్రితం స్వయంగా సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ అక్రమాలకు పాల్పడుతున్న అక్రమార్కులపై ఉక్కుపాదం మోపాలని చెప్పారు. అక్రమార్కులు ఎంతటి వారైనా చట్ట ప్రకారం కఠినంగా శిక్షించాలంటూ సూచించారు. ఇసుక పేరుకు పోయిన ప్రాంతాలు, క్వారీలు, నదులు, వాగుల్లో ప్రస్తుత పరిస్థితిపై క్షేత్ర స్థాయి విజిట్ చేయాలని ఆదేశాలిచ్చారు. కానీ ఆయన ఆదేశాలిచ్చి రోజులు గడుస్తున్నా ఉమ్మడి జిల్లాలో పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. సీఎం మాటలను కనీసం కేర్ చేస్తున్న అధికారులే కనిపించడంలేదు. ముఖ్యమంత్రి ఆదేశాలను బుట్ట దాఖలు చేస్తుండడం ఉమ్మడి జిల్లాలో చర్చనీయాంశమవుతున్నది. కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకుల ఒత్తిడి ముందు సీఎం ఆదేశాలు పనికి రాకుండా పోతున్నట్లుగా తెలుస్తున్నది. ఐఏఎస్, ఐపీఎస్‌లు సైతం ఇసుక అక్రమ రవాణాను అడ్డుకునేందుకు క్షేత్ర స్థాయికి వెళ్లి పరిశీలన చేయాలని సీఎం సూచించారు. కానీ జిల్లాలో అవేమీ మచ్చుకు కూడా కనిపించడం లేదు. ఇంత వరకు మైనింగ్, రెవెన్యూ అధికారులతో ఉన్నతాధికారులు కనీసం సమీక్ష కూడా నిర్వహించలేదు. అధికార పార్టీ బడా నేతల ఒత్తిడే కారణమని తెలుస్తున్నది. లోకల్ లీడర్ల ఆదేశాలకే జీ హుజూర్ అంటూ అధికార యంత్రాంగం చేతులు ఎత్తేసింది. స్థానిక నాయకులకు ఇస్తున్న ప్రాధాన్యతను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలకు జిల్లా ఉన్నతాధికారులు ఇవ్వకపోవడం గమనార్హం.

## ప్రధాన ముద్దాయి మైనింగ్ శాఖనే..

మైనింగ్ శాఖ జాయింట్ డైరెక్టర్ మధుసూదన్ రెడ్డి, నిజామాబాద్ మైనింగ్ ఏడీ విజయ్ కుమార్ రాథోడ్ బుధవారం పలు ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టినట్లుగా తెలిసింది. ఉన్నతాధికారుల ఆదేశాలతో ఈ ఏడాదిలో మొదటిసారి కార్యాలయం నుంచి కాలు బయట పెట్టిన మైనింగ్ అధికారులు ఈ సమాచారాన్ని మీడియాకు సమాచారం కూడా ఇవ్వకుండా, లీకులు ఇవ్వకపోవడంపై ఆశ్చర్యం నెలకొన్నది. ఇసుక రీచ్‌ల వద్ద తనిఖీలు చేసినట్లు ఉన్నతాధికారులకు నివేదికలు సమర్పించారు. కానీ ఇందులో ఇప్పటి వరకు వాటిల్లిన నష్టాలకు సంబంధించిన వివరాలను పొందుపర్చలేదని సమాచారం. జేడీ, ఏడీలు సంయుక్తంగా పరిశీలన చేసినప్పటికీ బుధవారం రాత్రి, గురువారం రోజంతా అనేక చోట్ల ఇసుక అక్రమ రవాణా భారీగా వెలుగు చూసింది. ఇసుక అక్రమాలను రెవెన్యూ యంత్రాంగమే అడ్డుకోవాలని, తమకేమీ సంబంధం లేదంటూ మైనింగ్ శాఖ చెబుతున్నది. ఖద్దర్ నేతల ఆదేశాల మేరకు రెవెన్యూ యంత్రాంగం కండ్లు మూసుకుని పని చేస్తున్నదని ప్రజలు విమర్శిస్తున్నారు. కండ్ల ముందు నుంచే ఇసుక లారీలు, టిప్పర్లు, ట్రాక్టర్లు తిరుగుతున్నప్పటికీ పట్టించుకునే వారు కరువయ్యారు. బాల్కొండ నియోజకవర్గంలో కమ్మర్‌పల్లి, మోర్తాడ్ మండల కేంద్రం మీదుగా జాతీయ రహదారిపై రయ్ రయ్ మంటూ ఇసుక లారీలు, టిప్పర్లు వెళ్తున్నా సంబంధిత శాఖలు కండ్లు మూసుకున్నాయి. కమ్మర్‌పల్లి, మోర్తాడ్ పోలీస్ స్టేషన్లకు కూత వేటు దూరం నుంచే వాహనాలు తరలి వెళ్తున్నప్పటికీ పోలీసులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తున్నది. ఇటీవల బిచ్కుందలో పోలీసులను, పోలీస్ వాహనాలను లెక్క చేయకుండానే ఇసుకను తరలించినట్లే బాల్కొండ నియోజకవర్గంలోనూ కాంగ్రెస్ నేతల ఆదేశాల మేరకు బరితెగించి పెద్దవాగు, కప్పల వాగు నుంచి ఇసుకను పెద్ద ఎత్తున కొల్లగొడుతున్నారు.

## ఇందూరు వేదికగా దేవుళ్లపై ఒట్టు!

2023, డిసెంబర్ 7న బాధ్యతలు స్వీకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటి వరకు నిజామాబాద్‌కు ఏ ఒక్క రోజు అధికారిక కార్యక్రమానికి హాజరుకాలేదు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా వేదికగా చేసుకుని ఏ ఒక్క పథకాన్ని ఇప్పటి వరకు ప్రభుత్వం ప్రారంభించలేదు. అడపా దడపా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు వచ్చారు. ఆ తర్వాత కొద్ది మంది మంత్రులు చుట్టపు చూపులా వచ్చి వెళ్లారు. మహారాష్ట్ర ఎన్నికల సమయంలోనూ మంత్రులు సుడిగాలి పర్యటనలు చేశారు. ముఖ్యమంత్రిగా ప్రజల కోసం అమలుచేస్తున్న సంక్షేమ పథకాల సమీక్ష కోసం ఏనాడు రాలేదు. 15 నెలల కాలంలో లోక్‌సభ ఎన్నికల సమయంలో నిజామాబాద్‌కు సీఎం హోదాలో తొలిసారిగా వచ్చారు. పాత కలెక్టరేట్ మైదానంలో నిర్వహించిన బహిరంగసభలో పాల్గొని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి టి.జీవన్ రెడ్డికి మద్దతుగా ప్రచారం చేశారు. అదే సభలో బాసర అమ్మవారిపై ఒట్టేసి రైతు రుణమాఫీ పూర్తి స్థాయిలో చేస్తానంటూ హామీ ఇచ్చారు. కానీ ఆయన ఇచ్చిన హామీ ఇంతవరకూ నెరవేరలేదు. బాసర అమ్మవారిపై ఒట్టేసిన తర్వాత రెండోసారి నిజామాబాద్‌కు సీఎం వస్తున్నారు. ఇది కూడా ఫక్తు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగమే కావడం గమనార్హం. ఉమ్మడి జిల్లాలో రైతు రుణమాఫీకి 2లక్షల మంది రైతులు నోచుకోలేదు. రైతుభరోసా ఇప్పటి వరకు సగానికన్నా ఎక్కువ మందికి అందలేదు. దేవుళ్లపై ఒట్టు వేసినందున రుణమాఫీ పూర్తిగా చేయాలని, మరోవైపు రైతు భరోసా పెట్టుబడి సాయాన్ని అందరికీ ఇవ్వాలని అన్నదాతలు కోరుతున్నారు.

# కాంగ్రెస్ మోసం చేసింది..

- కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డి ఓటమే లక్ష్యంగా పనిచేస్తా
- మాజీ డీఎస్పీ మదనం గంగాధర్



కంటతడి పెడుతున్న మాజీ డీఎస్పీ గంగాధర్

ఖలీల్‌వాడీ, ఫిబ్రవరి 23: కాంగ్రెస్ పార్టీ పన్నిన కుట్రలో తాను మోసపోయానని మాజీ డీఎస్పీ మదనం గంగాధర్ అన్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒక్కడిగా వచ్చి తన జీవితం, కుటుంబ నేపథ్యాన్ని చూపెట్టి అందరి ఆదరాభిమానాలు పొందాలని అనుకున్నానని, కానీ ఇలా కాంగ్రెస్ కుట్రలో బలి అవుతాని అనుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తూ కన్నీళ్లు పెట్టుకున్నారు. అయినా తాను భయపడే వ్యక్తిని కానని, వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. సంచార జీవితం గడిపిన తనకు, కుటుంబంలో ధైర్యమే కనిపించింది తప్ప, భయం ఎక్కడా లేదన్నారు. ఐదునెలల పాటు ప్రజాక్షేత్రంలో ఉంటూ ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్లానని, తనను అభిమానించిన ప్రతి ఒక్క మేధావి, నిరుద్యోగులు, పట్టభద్రులు క్షమించాలని కోరారు. స్వతంత్ర అభ్యర్థిగా దూసుకుపోతున్న తనకు పట్టభద్రుల డిమాండ్ కోసం కాంగ్రెస్ పార్టీతో కలిస్తే మ్యానిఫెస్టో సులభతరం అవుతుందని అనుకున్నానని తెలిపారు. సీఎం పిలిచినప్పుడు ఒక వ్యవస్థలో పనిచేసిన వ్యక్తిగా తాను వెళ్లానని, మంత్రి శ్రీధర్‌బాబు ఆధ్వర్యంలో తన ప్రమేయం లేకుండానే పార్టీ కండువా కప్పి, సోషల్ మీడియాలో కాంగ్రెస్‌లో చేరినట్లు ప్రచారం చేయడంతో అవాక్కైనట్లు చెప్పారు. తనకు ఫోన్ ద్వారా మెస్సేజ్ వచ్చింది చూసుకుని షాక్‌కు గురైనట్లు తెలిపారు. నామినేషన్ విత్‌డ్రా చేసుకోవాలని సూచించడంతో చేసుకున్నానని, తరువాత మంత్రి శ్రీధర్‌బాబుతో పాటు ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డి తనను పట్టించుకోకపోవడం తీవ్రంగా కలిచివేసిందని అన్నారు. దీంతో తాను మోసపోయానని గుర్తించానని తెలిపారు. తనను మోసం చేసిన వారికి ఓటు వేయద్దని, అర్హులకు మాత్రమే ఓటు వేయాలని మదనం గంగాధర్ కోరారు. సమావేశంలో భారతీయ కార్మిక సంఘాల సమైక్య జాతీయ అధ్యక్షుడు గొల్లపల్లి దయానందరావు, మాదిగ సంఘాల మహాకూటమి చైర్మన్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థిని ముఖ్యమంత్రే ఓడిస్తున్నాడు..

**స్వతంత్ర ఎమ్మెల్సీ అభ్యర్థి బక్క జడ్సన్ ఆరోపణ**

సమావేశంలో మాట్లాడుతున్న పట్టభద్రుల నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థి బక్క జడ్సన్

ఖలీల్‌వాడి, ఫిబ్రవరి 23: కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థిని ఓడించడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కుట్ర పన్నుతున్నారని పట్టభద్రుల నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థి బక్క జడ్సన్ ఆరోపించారు. తన పదవిని కాపాడుకునేందుకు ఎంతటికైనా తెగిస్తాడని పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ పూర్వ కార్యకర్త మేడిపల్లి సత్యం.. రేవంత్‌రెడ్డికి అత్యంత సన్నిహితుడని తెలిపారు. సత్యంతో సన్నిహితంగా ఉండే ప్రసన్న హరి కృష్ణ ఎమ్మెల్సీ బీ-ఫామ్ కోసం ప్రయత్నించాడని చెప్పారు. అయితే ఐటీ మంత్రి శ్రీధర్ బాబు తన పంతం నెగ్గించుకొని నరేందర్‌రెడ్డికి ఇప్పించారని తెలిపారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో శ్రీధర్‌బాబు పేరు వినిపిస్తున్నదని పొన్నం ప్రభాకర్ ప్రసన్న హరికృష్ణను స్వతంత్ర అభ్యర్థిగా నిలిపారని ఆరోపించారు. టికెట్ కోసం ఇతర పార్టీలను సంప్రదించారని తెలిపారు. తన సీటుకు ఎసరు రాకుండా చూసుకునేందుకు సీఎం అన్ని విధాలుగా ఏర్పాట్లు చేసుకుంటున్నారని పేర్కొన్నారు. తాను 34 ఏండ్లుగా ప్రజాక్షేత్రంలో ఉన్నానని, ప్రజా సేవ చేస్తున్న తనను గెలిపించాలని కోరారు.

# తవ్వుకో.. అమ్ముకో!

- కోటగిరి మండలంలో జోరుగా మొరం దందా
- రెచ్చిపోతున్న అక్రమార్కులు
- కనుమరుగవుతున్న గుట్టలు..
- చోద్యం చూస్తున్న అధికారులు

**మండలంలో మొరం దందాకు అడ్డూ అదుపులేకుండా పోయింది.** అక్రమార్కులు రాత్రి, పగలు తేడా లేకుండా తవ్వకాలు చేపడుతూ గుట్టలను మాయం చేస్తున్నారు. రెవెన్యూ భూములు, కొండలు, కుంటలు, అడవులనూ వదలడంలేదు. భారీ యంత్రాల సాయంతో తవ్వకాలు చేపడుతూ అందినకాడికి దండుకుంటున్నారు. మొరం దందాను నియంత్రించాల్సిన రెవెన్యూ, గనుల శాఖ అధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు.

–కోటగిరి, ఫిబ్రవరి 23

ఎత్తొండ గుట్ట శివారు నుంచి మొరం తరలిస్తున్న వాహనాలు

**ఎత్తొండ** క్యాంప్ సమీపంలోని గుట్ట, రాంపూర్, ఎక్లాస్‌పూర్, కోటగిరి సమీపంలో ఉన్న గుట్టలు క్రమేణా మాయమవుతున్నాయి. ఇక్కడ నిబంధనలకు విరుద్ధంగా మొరం తవ్వకాలు జోరుగా కొనసాగడంతో గుట్టలు మాయమవుతున్నాయి. భారీ యంత్రాలను గుట్టల వద్దే నెలల తరబడి ఉంచి మట్టి తరలిస్తున్నా అధికారుల్లో చలనం కరువైంది. కొందరు పట్టాలు ఉన్నాయంటూ కొందరు వ్యక్తులు యంత్రాల యజమానులకు మొరాన్ని అమ్ముకుంటున్నారు. కోటగిరి మండలం ఎత్తొండ సమీపంలో ఉన్న గుట్టలతో పాటు రాంపూర్, కోటగిరి, ఎక్లాస్‌పూర్ గుట్టలు ఆనవాళ్లు లేకుండా పోతున్నాయి. ఎలాంటి అనుమతులు లేకుండానే ఇష్టారాజ్యంగా అక్రమార్కులు తవ్వకాలు జరుపుతున్నారు.

**గుట్టుగా తవ్వకాలు..**

మొరం క్వారీ తవ్వకాల కోసం తహసీల్దార్ నుంచి ఎన్‌వోసీ తీసుకొని గనుల శాఖకు అందజేయాల్సి ఉంటుంది. అనంతరం సర్వేయర్ అనుమతి కోరిన చోట మైనింగ్‌కు అవకాశం ఉందా? లేదా? ఎంతమేర తరలించాలి? సీనరేజ్ చార్జీలు ఎంతమేర చెల్లించాలి? తదితర అంశాలను పరిశీలించి అనుమతులిస్తారు. కానీ అవేమీ లేకుండా అక్రమార్కులు మండలంలో గుట్టుగా గుట్టల్లోంచి మొరం తవ్వకాలు చేపడుతున్నారు.

**రాత్రివేళల్లో తవ్వకాలు..**

పగటివేళ పొక్లెయిన్లను మొరం తవ్వకాలు చేపట్టే ప్రదేశానికి దూరంలో నిలిపి ఉంచుతున్నారు. రాత్రివేళ సుమారు 11 గంటలు దాటిన తర్వాత మొరం తవ్వకాలు చేపట్టి టిప్పర్ల ద్వారా తెల్లవారుజాము వరకు తరలిస్తున్నారు. మొరం తవ్వకాలకు సమీపంలో నిలిపి ఉంచుతున్న పొక్లెయిన్లను ముందుగా అక్కడి నుంచి తొలగిస్తే మొరం తవ్వకాలు కొంతమేర అరికట్టే అవకాశం ఉన్నదని స్థానికులు సూచిస్తున్నారు. అధికారులు స్పందించి, అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

**6 టిప్పర్ల వేబిల్ పేరిట.. 60 ట్రిప్పుల తరలింపు?**

కొందరు వ్యాపారులు కేవలం 6 టిప్పర్లు మొరం అవసరం ఉన్నదని వేబిల్లులు తీసుకొని, 60 ట్రిప్పర్లు తరలిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు మొరం తవ్వకాలు చేపడుతున్నారు. ఎవరైనా అడిగితే తమకు అనుమతి ఉన్నదని చెబుతున్నారు. ఎత్తొండ శివారులో కొందరు ఇటుక బట్టీల పేరిట మట్టి తవ్వుతూ కుప్పలు చేస్తున్నారు. అనంతరం పొక్లెయిన్లను అక్కడే ఉంచి అప్పుడప్పుడు టిప్పర్లలో మొరం అక్రమంగా తరలిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. మొరం తవ్వకాల చోట ప్రభుత్వం సిబ్బందిని నియమించకపోవడంతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు.

**ఎలాంటి అనుమతిలేదు..**

ఎత్తొండ గుట్ట ప్రాంతంలో మొరం తవ్వకాలకు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు. రుద్రూర్ మండ లానికి 6 టిప్పర్ల కోసం దరఖాస్తు చేసుకుంటే ఆర్ఐ ఇచ్చారని తెలిసింది. ఇతరులకు అనుమతి ఇవ్వలేదు. అనుమతులు లేకుండా ఎవరైనా మొరం తవ్వకాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటాం.

–గంగాధర్, తహసీల్దార్, కోటగిరి

# మట్టి స్నానం ఆరోగ్యం పదిలం

**మండలంలోని పెద్ద చెరువులో** కామారెడ్డి జిల్లా యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మట్టి స్నానాలు కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో 120 మంది పాల్గొన్నారు. మట్టి స్నానం ఆచరించడం ద్వారా అనేక రకాల చర్మ రోగాలు నయం కావడమే కాకుండా సహజ చర్మ సౌందర్యం పొందవచ్చని యోగా అసోసియేషన్ ప్రతినిధి రాంరెడ్డి తెలిపారు.

–భిక్కనూరు, ఫిబ్రవరి 23